సాక్షి
రంగారెడ్డి



దైవచింతనతో ప్రశాంతత

దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు

8లో▸

సోమవారం। 15। జనవరి। 2024



ఆమనగల్లు: ఇంటిముందు ముగ్గు వేస్తున్న మహిళ

పల్లెకు పండుగ కళ

పల్లెకు పండుగ కళ వచ్చింది. సంక్రాంతి నేపథ్యంలో ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది. వేడుక మూడు రోజుల్లో భాగంగా ఆదివారం భోగి మంటలు వేసి సంబరాలు చేసుకున్నారు. చిన్నారులకు భోగి పళ్లు పోసి.. ఇళ్ల ముందు రంగవల్లులు, గొబ్బెమ్మలతో కలర్‌ఫుల్‌గా తీర్చిదిద్దారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఉత్సాహంగా గాలిపటాలు ఎగురవేశారు. పలుచోట్ల ముగ్గుల పోటీలు, క్రీడా పోటీలు నిర్వహించారు. ఊరూ.. వాడా పండుగ జోష్‌లో మునిగి తేలారు.



కందుకూరు: భోగి మంటలు వేస్తున్న యువకులు, చిన్నారులు



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో పతంగులు ఎగురవేస్తున్న చిన్నారులు, యువకులు



యాచారం: నందివనపర్తిలో ముగ్గుల పోటీ

ఆంధ్ర సంక్రాంతి బరిలో

మన పందెం కోడి

- జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో పెంపకం
- పౌష్టికాహారం.. ప్రత్యేకంగా తర్ఫీదు
- పండుగ వేళ ఫుల్ డిమాండ్
- రూ.50 వేల వరకు పలుకుతున్న ఒక్కో పుంజు

పహాడీషరీఫ్: ఆంధ్రప్రదేశ్‌లో జరిగే కోడి పందేల కోసం తెలంగాణ కోడి పుంజులు కదనరంగంలోకి దూకేందుకు సిద్ధమయ్యాయి. రెండు నెలల ముందు నుంచే ప్రత్యేక తర్ఫీదు పొందిన పుంజులు ఎప్పుడెప్పుడు బరిలోకి దిగాలా అని కాళ్లు దువ్వుతున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగే కోడి పందేలకు.. హైదరాబాద్ పాత నగర శివారు ప్రాంతాలకు విడదీయరాని బంధం ఉంది. పరువు, ప్రతిష్టలే లక్ష్యంగా పందేలు కాసేవారు విజేతగా నిలిచే సత్తా ఉన్న కోడిపుంజుల వైపు మొగ్గు చూపుతున్నారు. కంటికి నచ్చిన మేలు జాతి పుంజుకు రూ.50 వేల వరకు కూడా వెచ్చించేందుకు వెనుకాడడం లేదు. జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో పందెం కోళ్ల కూతలు వినిపిస్తున్నాయి.

అల్లారుముద్దుగా..

ఎర్రకుంట, షాహిన్‌నగర్, కొత్తపేట, సలాల పరిసరాల్లో కుస్తీ పోటీలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చే పహిల్వాన్లు మూగ జీవాలను కూడా అంతే మక్కువతో పెంచుతారు. ఈ క్రమంలోనే కాకి, డేగ, నెమలి, అస్లీ తదితర మేలు జాతి కోడి పుంజులను అదే రీతిలో పెంచేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఏటా సంక్రాంతి బరిలో దించుతుంటారు. పరిపాటిగా మారింది. కోట్లాది రూపాయలు వెచ్చించి పోటీలకు కాలు దువ్వే పందెంరాయుళ్లకు ఇక్కడి పుంజులు పంట పండించడం విశేషం.

వ్యాయామం సైతం

సంక్రాంతి పండుగకు రెండు నెలల ముందు నుంచే ఈ కోడి పుంజులకు ప్రత్యేక శిక్షణ ఇస్తుంటారు. సాధారణంగానే నిత్యం వీటికి పౌష్టికాహారంతో పాటు వ్యాయామం చేయించే యజమానులు పండుగ బరి కోసం మరింత తర్ఫీదునిస్తారు. పందేనికి అన్ని రకాల సిద్ధమైన కోడి పుంజులను కొనుగోలు చేసేందుకు పందెం రాయుళ్లు పక్షం రోజుల నుంచే పహిల్వాన్లతో టచ్‌లో ఉంటారు. పందెంలో కచ్చితంగా నెగ్గుతామనే నమ్మకంతో వీరి వద్ద నచ్చిన పుంజును కొనుగోలు చేస్తుంటారు. పరిమిత సంఖ్యలో పుంజులను పెంచి ఎంతో దగ్గరి వ్యక్తులకు మాత్రమే ఇక్కడ విక్రయిస్తుంటారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

వీరు పెంచే కోడి పుంజులకు విటమిన్‌లతో కూడిన బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తారు. బాదం, పిస్తా, అక్రోట్, కీమా, రాగులు, ఉడికించిన గుడ్ల (తెలుపు భాగం)ను ఇస్తుంటారు. ముఖ్యంగా ప్రతిరోజు నైపుణ్యం కలిగిన కోచ్‌లతో రెండు పూటలా మసాజ్‌లు చేయిస్తారు. పరిగెత్తించడంతోపాటు ఈత కూడా కొట్టిస్తారు. కోళ్లకు ఎలాంటి రోగాలు రాకుండా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. వీటికి ప్రత్యేకమైన ఎన్‌క్లోజర్ల మాదిరిగా చిన్న చిన్న గూళ్లను ఏర్పాటు చేసి మినీ జూపార్కును తలపించేలా మూగ జీవాల పెంపకంలో పహిల్వాన్ల కుటుంబాలు నిమగ్నమయ్యాయి. మూగ జీవాలపై ఉన్న ప్రేమతో మాత్రమే తాము కోళ్లను పెంచుతున్నాము తప్ప తమది వ్యాపార దృక్పథం కాదని పహిల్వాన్లు పేర్కొంటున్నారు.



ఇలా ఉభయ గోదావరి జిల్లాల్లో పెద్ద ఎత్తున జరిగే కోడి పందేలకు ఇక్కడి నుంచి కోళ్లను ఎగుమతి చేయడం

నిర్లక్ష్యపు జబ్బు!

- ఇష్టారాజ్యంగా ఇండెంట్లు.. పంపిణీకి నోచుకోని కళ్లద్దాలు
- అవసరానికి మించి మందులు, వైద్య పరికరాల కొనుగోలు
- పారాసిటమాల్ సిరప్ మొదలు.. కళ్లద్దాల వరకు ఇదే వరుస
- డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గుట్టలుగా మందుల డబ్బాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు నిర్లక్ష్యపు జబ్బు పట్టింది. క్షేత్రస్థాయిలో అవసరం లేకపోయినా.. తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాల సంస్థకు ప్రతిపాదనలు పంపడం.. విలువైన వైద్య పరికరాలు, మందులు కొనుగోలు చేయడం.. ఆ తర్వాత మూలకుపడేయడం పరిపాటిగా మారింది. రూ.కోట్ల విలువైన ప్రజాధనం వృథా కావడంతో పాటు నిరుపేదలకు కనీస వైద్యసేవలు అందకుండా పోతున్నాయి. ఎప్పటికప్పుడు ఆయా ఆస్పత్రుల్లో తనిఖీలు చేసి మందులు, మౌలిక సదుపాయాలపై ఆరా తీయాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి.

బాధితులకు చేరని అద్దాలు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2023 జనవరి 19 నుంచి జూన్ 30 వరకు కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని చేపట్టింది. వంద రోజుల కార్యక్రమంలో భాగంగా 80 కంటి వెలుగు బృందాలను ఏర్పాటు చేసింది. 11 లక్షల మందికి కంటి పరీక్షలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించి, ఈ మేరకు 7,54,756 మందికి నిర్వహించారు. వీరిలో 98,184 మందికి రీడింగ్, 86,819 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసులు సిఫార్సు చేశారు. సంబంధిత ఏజెన్సీలు ఆయా గ్లాసులను కూడా సరఫరా చేశాయి. కార్యక్రమం ముగిసి ఏడాది కావొస్తున్నా.. ఇప్పటి వరకు వాటిని లబ్ధిదారులకు అందజేయకపోవడం చూస్తే.. అధికారుల నిర్లక్ష్యం ఏపాటిదో ఇట్టే అర్థమవుతుంది. ప్రభుత్వం సరఫరా చేసిన అద్దాలు పెద్ద సంఖ్యలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలోనే మగ్గిపోతున్నాయి. కంటి పరీక్షలు చేయడంలో కీలకమైన స్టాండ్స్ సైతం మూలకు చేరాయి. వాక్సినేషన్ల నిల్వ, సరఫరా పేరుతో అవసరం లేకపోయినా అడ్డగోలుగా ఫ్రీజర్ బాక్సులు కొనుగోలు చేసి, ఆరు బయట పడేశారు. వాటిపై పక్షులు రెట్టలు వేసి ఎందుకు పనికిరాకుండా పోయాయి.



డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పడి ఉన్న మందులు

మందులు, సిరప్‌లదీ అదే పరిస్థితి

రోగుల అవసరాలతో సంబంధం లేకుండా మందులు, వైద్య పరికరాలు కొనుగోలు చేయడంతో పాటు రోజుల తరబడి వాటిని వినియోగంలోకి తీసుకురాకుండా మూలనపడేయడం గమనార్హం. ఆ తర్వాత గుట్టుచప్పుడు కాకుండా ఆయా మందులు, సిరప్‌లను మురుగు కాల్వల్లో పడేయడం, మంటల్లో కాల్చేస్తుండటం విశేషం. ఏకంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలోనే పారసిటమాల్ సిరప్‌లు గుట్టలుగా, వృథాగా పడి ఉన్నాయి. 2025 వరకు గడువున్న మందులు, సిరప్‌లను సైతం మూలన పడేయడం అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతోంది. ఇదిలా ఉంటే నందనవనం బస్తీదవాఖానాలో కాలం చెల్లిన మందులను అదే ప్రాంగణంలో కాల్చివేయడం కన్పించింది. ఓఆర్‌ఆర్‌కు అటు ఇటుగా ఆనుకుని ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ కేంద్రాల్లోనే పరిస్థితి ఇంత ఉంటే.. మారుమూల పల్లెల్లోని ఆరోగ్య కేంద్రాల్లోని మందుల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది.

‘పీఎం జన్‌మన్’ ఏర్పాట్ల పరిశీలన



కడ్తాల్: పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి చెంచు కుటుంబాలతో వర్చువల్ మీటింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏర్పాట్లను డీటీడీవో రామేశ్వరిదేవి, ఇతర అధికారులు పరిశీలించారు. గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహం, ఆశ్రమ పాఠశాలలో కడ్తాల్, ఆమనగల్లు మండలాల పరిధిలోని చెంచులతో మోదీ వర్చువల్ మీటింగ్ ద్వారా సమావేశం కానున్నారు. సమావేశం అనంతరం లబ్ధిదారులకు జన్‌మన్ బ్యాంకు అకౌంట్, కిసాన్ క్రెడిట్‌కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, చెంచుల కోసం ప్రత్యేకంగా మెడికల్ ఎంఎంయూ వాహనం ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి పద్మజ, కృష్ణవేణి, ఎంపీడీవో రామకృష్ణ, ఏఓ శ్రీనివాస్, వార్డెన్ రాములు, జూనియర్ అసిస్టెంట్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలోనూ ముందుండాలి



విజేతలతో ప్రజాప్రతినిధులు, నాయకులు

- ఆటలతో పాటు సమాజసేవపై దృష్టి సారించాలి
- డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో కడ్తాల్ క్రికెట్ అసోసియేషన్–హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కడ్తాల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. విజేతగా నిలిచిన కడ్తాల్ మాన్‌స్టార్ జట్టుకు శ్రీనివాస్‌రెడ్డి రూ.25 వేలతో పాటు ట్రోఫీ అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన స్ట్రైకర్ టీంకు సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి రూ.15,116తో పాటు షీల్డ్ అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి మాట్లాడారు. యువత ఆటలతో పాటు సమాజ సేవలోనూ ముందుండాలని సూచించారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలని క్రీడాకారులకు సూచించారు. మండల కేంద్రంలో క్రీడా మైదానం ఏర్పాటు చేసేందుకు త్వరలోనే ఐక్యవేదిక ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్‌ఆర్‌ఐ శ్రీనివాస్, హనుమాన్ యూత్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, బీసీ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, యువజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు రాఘవేందర్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు జహంగీర్‌అలీ, రవీందర్‌రెడ్డి, వడ్డెరాజు, బండ శ్రీను, రాంచందర్, దేవేందర్‌గౌడ్, హర్షవర్ధన్, అశోక్‌రెడ్డి, మహేశ్, మణికంఠ, రమేశ్, జగన్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

మొయినాబాద్: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండలం బోడంపహాడ్ గ్రామానికి చెందిన సబ్బర్‌గారి శ్రీకాంత్(22) మూడేళ్లుగా మండల పరిధి తోలుకట్ట గ్రామంలో ఉండే తన బావ మల్లేశ్ వద్ద కొరియర్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు పనికి వెళ్లి, రాత్రి 7 గంటలకు తిరిగి వచ్చేవాడు. రోజు మాదిరిగానే ఈ నెల 13న పనికి వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో శ్రీకాంత్.. తన సోదరికి ఫోన్ చేసి తనకు జీవితంపై విరక్తి వచ్చిందని.. అజీజ్‌నగర్ దగ్గర పురుగుల మందు తాగుతున్నాని చెప్పాడు. వెంటనే సోదరి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాంత్ కోసం వెతికారు. తోలుకట్ట సమీపంలోని ఓ వెంచర్‌లో అపస్మారకస్థితిలో పడున్న శ్రీకాంత్ కనిపించడంతో వెంటనే నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

- ఇతరులపై ఆత్మీయత చూపాలి
- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ఘనంగా గోదాదేవి కల్యాణం



కొత్తూరు: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

కొత్తూరు: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఆధ్యాత్మికత కలిగిన వారు తోటివారి పట్ల ప్రేమానురాగాలతో మెలుగుతారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం కొత్తూరు మండలం పెంజర్ల గ్రామం అనంతపద్మనాభస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గోదాదేవి, రంగనాయకులస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవానికి ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఉరుకుల పరుగుల జీవనంలో దైవ చింతన చాలా వరకు ప్రశాంతత కలిగిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బెజవాడ అనితారెడ్డి, నాయకులు వేణుగోపాల్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, కృష్ణ, బాల్‌రాజు, శంకరయ్య, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

షాద్‌నగర్: యువతీయువకులు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో షాద్‌నగర్ ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన యువకులు ఉన్నారని, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే విధంగా టోర్నీ నిర్వాహకులు కృషి చేయాలని సూచించారు. ఆటలతో మానసికంగా ఉల్లాసంగా ఉండటంతో పాటు శారీరకంగా దృఢంగా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా టోర్నీ విజేత జట్టుకు రూ.25వేలు, రన్నర్ జట్టుకు రూ.15వేల నగదు బహుమతితో పాటు ఉత్తమ బ్యాట్స్‌మెన్, బౌలర్, మ్యాన్ ఆఫ్‌ది సీరిస్ ట్రోఫీలను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, బస్వం, శివశంకర్‌గౌడ్, ముబారక్, అందెమోహన్, ఖదీర్, సీతారాం, మంగ మధు, కబీర్ తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’పేరిట అవకతవకలు

షాద్‌నగర్: రెండు పడక గదుల పేరిట గత పాలకులు అవకతవకలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. షాద్‌నగర్ మండలం కొండన్నగూడ గ్రామ శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూంలను ఎమ్మెల్యే పరిశీలించి, అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇండ్లు మొత్తం బీటలు వారి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని మండిపడ్డారు. వారి అసమర్థ పాలనకు ఇదే నిదర్శనమన్నారు. అర్హులైన వారికి ఇళ్లు అందజేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



డబుల్ బెడ్‌రూంలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

కోలాహలంగా లోహ్రీ మేళా

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని ఎస్వీటీ ఆడిటోరియంలో పంజాబీలు కోలాహలంగా లోహ్రీ మేళాను జరుపుకున్నారు. ఆదివారం సాయంత్రం పంజాబీ సేవా సమితి తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగరంలోని పంజాబీలో పెద్ద ఎత్తున హాజరై ఉత్సాహంగా వేడుకలు చేసికున్నారు. భోగి మంటలు, అందమైన రంగవల్లులు, లైవ్ సంగీతంతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల గేమ్స్‌తో కుటుంబాలన్నీ కలిసి ఆహ్లాదకరంగా జరుపుకున్నారు. సంస్థ కన్వీనర్ సునీల్ పురి, మాజీ అధ్యక్షులు వినీత్ అరోరా, ప్రతినిధులు ఉమేష్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

అలరించిన ఫ్యాషన్ షో



రాంగోపాల్‌పేట్: గుజరాతీ ఏక్తా మహోత్సవ్–24లో భాగంగా సికింద్రాబాద్ ఆర్పీ రోడ్‌లోని గుజరాతీ స్కూల్‌లో ప్రదర్శించిన చిన్నారుల ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. ఏప్రిల్‌లో జరిగే గ్రాండ్ ఫినాలే జరిగే ఆడిషన్స్‌లో సుమారు 200 మంది చిన్నారులు హాజరై ఔరా అనిపించారు. తెలంగాణ గుజరాతీ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంప్రదాయ, సమకాలీన దుస్తులు ధరించి చిన్నారులు ర్యాంప్‌పై చేసిన క్యాట్ వాక్ చేశారు. సమాజ్ అధ్యక్షుడు ప్రేమల్ పరేఖ్, ఉపాధ్యక్షులు మన్సుఖ్ పటేల్, ప్రధాన కార్యదర్శి మినాల్ విఖారియా, కోశాధికారి కృష్ణకాంత్, ట్రస్టీలు చేతన్‌భోగాని, చైర్మన్ జస్మత్ పటేల్ పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో గృహిణి అదృశ్యం



హసీనా



అఫ్రీన్



హుస్సేన్

పహాడీషరీఫ్: కుటుంబ కలహాల కారణంగా ఓ గృహిణి తన ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడ మంఖాల్ గ్రామానికి చెందిన హసీనా(30), యాసిన్ దంపతులకు అఫ్రీన్(14), హుస్సేన్(8) ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా ఇటీవల భార్య భర్తలు తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలోనే గత నెల 18న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఇద్దరు పిల్లలతో కలిసి బయటికి వెళ్లిన హసీనా.. తిరిగి ఇంటికి రాలేదు. వారి కోసం వెతికినా ఆచూకి తెలియరాలేదు. దీంతో హసీనా తల్లి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 87126 62367 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

బాలుడిని కిడ్నాప్ చేసిన మేనమామ

అల్వాల్: భోగి పండుగ వేళ గాలిపటంతో ఓ బాలుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి కిడ్నాప్ అయిన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ సూర్యనగర్‌లో నివసించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కుమారుడు (12) ఆదివారం ఉదయం పతంగితో పాటు సెల్‌ఫోన్ పట్టుకొని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొద్దిసేపటికి.. బాలున్ని కిడ్నాప్ చేశామని, రూ.20 లక్షలు ఇస్తేనే వదిలిపెడతామని కిడ్నాపర్ నుంచి తండ్రికి ఫోన్ వచ్చింది. దీంతో పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా బాలుడి మేనమామే కిడ్నాప్‌కు పాల్పడినట్లు గుర్తించారు. మేనమామను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భూమి ఇప్పిస్తానంటూ యువతికి టోకరా

- మోసం చేసిన రియల్ వ్యాపారి, అతని స్నేహితులు
- బాధితురాలి ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు

వెంగళరావునగర్: భూమి కొనుగోలు చేయిస్తానని యువతిని వద్ద లక్షలాది రూపాయలు తీసుకుని రియల్ వ్యాపారులు మోసం చేసిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌లో నివసించే కూన సరస్వతి అనే యువతి స్థానికంగా టెక్స్‌టైల్స్ వ్యాపారం నిర్వహిస్తోంది. ఆమెకు తెలిసిన అశోక్‌రెడ్డి, సాయికుమార్‌ముని అనే ఇద్దరు గత ఏడాది సుబ్బరామిరెడ్డి అనే వ్యక్తిని సరస్వతికి పరిచయం చేశారు. దుర్గాప్రసాద్ రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానని ఆమెకు తెలియజేసి యాదగిరిగుట్ట వద్ద ప్రభుత్వ స్థలం కాంప్లికేట్‌గా ఉందని, దానిని తక్కువరేటుకు ఇప్పిస్తానని చెప్పారు. దాంతో సరస్వతి అక్టోబర్‌లో ఇరువురు స్నేహితుల సమక్షంలోనే దుర్గాప్రసాద్ రెడ్డికి రూ. 34 లక్షలు ఇచ్చింది. వాటిని తీసుకుని వారంలో రిజిస్ట్రేషన్ చేయిస్తామని చెప్పిన వారు అనంతరం ఫోన్లు లిఫ్ట్ చేయడం లేదు. నెలరోజుల తర్వాత ఆమెకు అనుమానం వచ్చి ల్యాండ్ చెప్పిన ప్రాంతానికి వెళ్లి చూడగా అక్కడ ఖాళీ ప్రభుత్వ జాగా కనిపించలేదు. దాంతో మోసపోయానని గ్రహించి వారికి ఫోన్ చేసి నిలదీసింది. తనకు ల్యాండ్ వద్దని తన నగదు తనకు వెనక్కు ఇవ్వాలని అడిగింది.

అయితే వారు ఇదిగో అదిగో అంటూ ఆమెను తిప్పుతున్నారు తప్ప డబ్బులు ఇవ్వడంలేదు. విసిగిపోయిన సరస్వతి సీసీఎస్‌లో ఫిర్యాదు చేసింది. సీసీఎస్ పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్ చేసి ఆదివారం మధురానగర్ పోలీస్ స్టేషన్‌కు పంపారు. వాస్తవాలు విచారించిన మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధితురాలి కారులోని బంగారు ఆభరణాల చోరీ

ఇదిలా ఉండగా కూన సరస్వతి మధురానగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో కారు ఆపి పోలీసులకు ఫిర్యాదు చేసి తిరిగి వచ్చింది. గమనించగా కారు అద్దాలు కిందికి దించి ఉన్నాయి. కారులో తన బ్యాగ్‌ను తీసుకుని పరిశీలించగా అందులో ఉండాల్సిన చేతి ఉంగరాలు, యాపిల్ ఎయిర్ పాడ్స్ కనిపించలేదు. యువతి తిరిగి పోలీస్ స్టేషన్‌కు వచ్చి దొంగతనం జరిగిందంటూ ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చైనా మాంజా సీజ్

అబిడ్స్: నిషేధిత నైలాన్ సింథటిక్ మాంజా (చైనా మాంజా)ను విక్రయిస్తున్న వారిపై నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు మంగళ్‌హాట్ పోలీసులు దాడులు నిర్వహించారు. నిషేధిత మాంజాను విక్రయిస్తున్న ధూల్‌పేట్ పరిసర ప్రాంతాల్లోని 18 దుకాణాలపై కేసులు నమోదు చేసి, రూ.10 లక్షల విలువైన వెయ్యి చెరాక్‌ల మాంజాను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆభరణాలు చోరీ

కాచిగూడ: గుంతకల్లు రైలులో ప్రయాణిస్తున్న ఓ మహిళ బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల మేరకు.. వికారాబాద్ జిల్లా కుల్కచర్లకు చెందిన విజయలక్ష్మి (28) మేడ్చల్ రైల్వే స్టేషన్‌లో భోదన్–గుంతకలు రైలులో మహబూబ్‌నగర్‌కు వెళ్తున్నారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌లో తన బ్యాగును చూసుకోగా.. అందులోని 2.50 తులాల ఆభరణాలు కన్పించలేదు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు కాచిగూడ రైల్వే పోలీసులు తెలిపారు.

బాలికపై లైంగిక వేధింపులు.. వ్యక్తి అరెస్ట్

కుషాయిగూడ: మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఓ కామాంధుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. ఈ సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హెచ్‌బీకాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. డీఐ సాయిప్రకాశ్‌గౌడ్ తెలిపిన మేరకు.. హెచ్‌బీకాలనీ,భక్షిగూడకు చెందిన విజయ్‌కుమార్ (32) సెంట్రింగ్ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. అతడికి ఇంకా వివాహం కాలేదు. ఇంట్లో ఒంటరిగా ఉండే విజయ్‌కుమార్ పక్కింట్లో ఉండే సుమారు 10 సంవత్సరాల వయసు కలిగిన బాలికకు పండ్లు, చాకెట్లు ఆశచూపి ఇంట్లోకి పిలుచుకుని లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం తెలిసిన తల్లిదండ్రులు పోలీసులకు అప్పగించారు. అదుపులోకి తీసుకున్న పోలీసులు కామాంధుడిని రిమాండ్‌కు తరలించారు.

బోగస్ వివరాలతో ఆధార్ కార్డులు!

- వీటి ఆధారంగా బ్యాంకుల్లో కరెంట్ ఖాతాలు
- సైబర్ నేరగాళ్లకు అందిస్తున్న ఇద్దరు యువకులు
- ఒక్కో అకౌంట్‌కు రూ.25 వేల చొప్పున వసూలు
- బాధితుల నుంచి నగదు స్వాహాకు వినియోగం
- ఇద్దరిని అరెస్టు చేసిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: వివిధ రకాలుగా ఎర వేసి, బాధితుల నుంచి అందినకాడికి దండుకునే సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు చాలా కీలకం. వీటిని తమ పేర్లు, వివరాలతో తీసుకుంటే పోలీసులకు చిక్కే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో సూత్రధారులు ఈ ఖాతాలను తెరిచి ఇవ్వడానికి ఉత్తరాదిలో ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నారు. బోగస్ వివరాలతో తెరిచిన ఒక్కో బ్యాంక్ ఖాతాను రూ.25 వేలకు విక్రయిస్తున్న ఇద్దరు ఫరీదాబాద్ వాసులను హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ఢిల్లీ వాసి కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు సంయుక్త సీపీ ఏవీ రంగనాథ్ ఆదివారం వెల్లడించారు.

ఉద్యోగాల పేరుతో ప్రకటనలిచ్చి...

ఢిల్లీకి చెందిన ఘరానా సైబర్ నేరగాడు దేవేందర్ పంచాల్ దేశ వ్యాప్తంగా అనేక మంది నుంచి భారీ మొత్తం దండుకున్నాడు. వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా ఉద్యోగాల పేరుతో ప్రకటనలు ఇవ్వడం, ఆకర్షితులై స్పందించిన వారితో సంప్రదింపులు జరపడం చేస్తుంటాడు. ఆపై ఉద్యోగానికి ముందు తమ వద్ద కొంత మొత్తం పెట్టుబడి పెట్టాలంటూ నమ్మించి అందినకాడికి దండుకుంటారు. ఇలా నగరంలోని అమీర్‌పేట ప్రాంతానికి చెందిన ఓ బాధితుడి నుంచి రూ.4.75 లక్షలు కాజేశాడు. ఈయన ఫిర్యాదు మేరకు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. ఏసీపీ ఆర్‌జీ శివమారుతి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ కె.ప్రసాదరావు దీన్ని దర్యాప్తు చేశారు. బాధితుడు ఓ బ్యాంకు ఖాతాలో డబ్బు డిపాజిట్/ట్రాన్స్‌ఫర్ చేయగా... అది ఢిల్లీలోని రిచిక ఇన్ఫోసిస్టమ్స్ పేరుతో ఉన్న కరెంట్ ఖాతాలోకి బదిలీ అయినట్లు గుర్తించారు. ఇందులో మొత్తం రూ.2.5 కోట్లు డిపాజిట్ కాగా... ఖాతాలో ఉన్న రూ.6 లక్షలు ఫ్రీజ్ చేశారు. ఈ కరెంట్ అకౌంట్‌ను పంజక్ చాహు అనే వ్యక్తి తెరిచినట్లు గుర్తించిన దర్యాప్తు అధికారులు మూలాలు కనుక్కోవడంపై దృష్టి పెట్టారు.

ఐదు కార్డులు రూపొందించి..

ఫరీదాబాద్‌కు చెందిన ప్రవీణ్ ఓ బ్యాంకులో పని చేస్తూ, ఆధార్ కార్డు ప్రాసెసింగ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. దేవేందర్ సూచనల మేరకు ప్రవీణ్ తన స్నేహితుడైన హిమాన్షు ఫొటో, వేలిముద్రలు, ఐరిష్ ఆధారంగా పంకజ్ చాహు పేరుతో ఆధార్ కార్డు ప్రాసెస్ చేశాడు. ఇలా ఇతడి ఫొటోతో, వేర్వేరు తప్పుడు వివరాలు, పేర్లతో మొత్తం ఐదు కార్డులు రూపొందించాడు. ఇవి దాఖలు చేయడం ద్వారా పాన్‌కార్డులు తీసుకుని... ఒక్కో కార్డు ఆధారంగా నాలుగు చొప్పున వేర్వేరు బ్యాంకుల్లో కరెంట్ ఖాతాలు తెరిచాడు. ఒక్కో ఖాతాను రూ.25 వేలకు దేవేందర్‌కు విక్రయించాడు. బ్యాంకు ఖాతాకు సంబంధించిన పాస్‌బుక్, చెక్కుబుక్, డెబిట్ కార్డులతో పాటు దాంతో లింకై ఉన్న ఫోన్ నెంబర్‌ను అతడికి అందించాడు. ఇలాంటి వాటిలో రిచిన ఇన్ఫోసిస్టమ్స్ ఖాతా కూడా ఒకటి. ఈ వివరాలు గుర్తించిన సైబర్ క్రైమ్ అధికారులు దేవేందర్‌తో పాటు హిమాన్షు, ప్రవీణ్‌లను పట్టుకోవడానికి ఢిల్లీ, ఫరీదాబాద్‌లకు ప్రత్యేక బృందాలను పంపారు.

ఇద్దరి అరెస్ట్.. దేవేందర్ పరార్

ఢిల్లీలోని రోహిణి ఠాణాలో నమోదైన కేసులోనూ దేవేందర్ ప్రమేయం ఉంది. దీంతో కొన్ని రోజుల క్రితం ఆ పోలీసులు ఇతడి కోసం ప్రయత్నాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న దేవేందర్ పూర్తి అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో సిటీ పోలీసులకు చిక్కలేదు. ఫరీదాబాద్‌లో గాలించిన బృందం మిగిలిన ఇద్దరినీ అరెస్టు చేసి తీసుకువచ్చింది. వీరి నుంచి ఫోన్లు, సిమ్‌కార్డులు తదితరాలు స్వాధీనం చేసుకుని దేవేందర్ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఆధార్ అధికారులకు ఈ వ్యవహారం తెల్పగా ఐదు కార్డులను రద్దు చేయడంతోపాటు సెంటర్ లైసెన్స్‌నూ రద్దు చేశారు.